
# చెంపదెబ్బ

— బండారు లక్ష్మి



దృష్టినంతా పని మీద కేంద్రీకరించిన శేషుబాబు—తన చుట్టూ కందిరీగలు తిరుగుతున్నట్లు అనుభూతి కలిగి తలెత్తి గడియారం వైపు చూసేడు. ఐదవ్వడానికింకా ఐదు నిమిషాలే వుంది.

ఐ. సి. అనుకుంటూ పెన్-స్టాండులో పెట్టి ఫోనందుకున్నాడు. అంత వరకూ యజమాని చుట్టూ తిరుగుతున్న ఆత్మలు-శరీరాల్లోకి వెళ్ళిపోయి గబ గబా కాగితాలు సర్దుకోసాగాయి.

"సుధా."

"యస్. స్పీకింగ్"

"ఎక్కడికీ వెళ్ళలేదా?"

"లేదు."

"డైనమైట్ యింట్లోనే వున్నాడా?"

"ఊఁ"

"ఏం చేస్తున్నాడు?"

"చదరంగం ఆడుతున్నాం."

నాట్ ఎ బేడ్ ఎంగేజ్‌మెంట్. "నేను క్లబ్‌కి వెళ్తాస్తా".

"మంచిది."

ఫోన్ పెట్టేసి పి. ఎ. తో అర్జంటు విషయాలు చెప్పి బయటికి నడిచాడు శేషుబాబు.

కారు స్టార్ట్ చేస్తూ సైకిల్‌స్టాండ్ వైపు చూసేడు. తన కారు చక్రాలు కదిలితే గాని ఆ సైకిలు చక్రాలు కదలవు అనుకుంటే తనమీద తనకే ఎంతో గర్వం కలిగింది.

ఈలవేస్తూ కారుని పోనిచ్చాడు క్లబ్ వైపు.

అందరు వ్యాపారవేత్తల్లాగ - బొక్క సాన్నెగాని బొజ్జను పెంచలేదతను అందుకే "యంగ్‌మేన్ ఇన్ సిక్స్టీ" అంటారు అతని ఫ్రెండ్స్.

సెక్సీ ఇన్ సిక్స్టీ—

గేమ్ కొట్టినందువల్ల వచ్చిన విజయ గర్వంతో టెన్నిస్‌రాకెట్ బల్లమీద పడేసి కూర్చున్నాడు శేషుబాబు. అటెండర్ తెచ్చిన ఐస్‌క్రీం అందుకున్నాడు. అతని చెమటని ఆర్పడానికి ఫాన్ తన మూడు రెక్కల్నీ ముక్కలు చేసుకుంటోంది. ఎవరెవరో హలో అంటున్నారు. పోతురాజులతో మాట్లాడమంటే బోరు అతనికి. అందుకే తల పంకింపు. చిన్నచిరునవ్వుతో సరిపెట్టేస్తున్నాడు. బయట వెలుతురు తగ్గే

కొద్ది లోన రద్దీ పెరుగుతోంది.

రమ్మీకింకా మైమవలేదు.

"మీకోసం ఎవరో వచ్చారు సార్" వినయంగా చెప్పేడు అటెండర్.

లోపలికి తీసుకురా" సిగరెట్ వెలిగించాడు శేషుబాబు.

"అమ్మగారు మిమ్మల్నే రమ్మంటున్నారు. సార్!" ఏ రీడ్ నొక్కితే ఏ స్వరం పలుకుతుందో అతనికి బాగా తెలుసు. అతను నాటకాల్లో హార్మనీ వాయిస్తాడు.

"అమ్మగారా! ఐ సీ" శేషు నిమిషం కూడా వృధాచేయలేదు. కాంతా కనకాల విషయంలో ఆలస్యం మరింత విషం అన్నది అతని ప్రిన్సిపుల్.

శేషుని చూసేక క్రిందికిదిగి టాక్సీని పంపించేసింది ఆవిడ. మసకచీకట్లో ఆవిడెవరో తెలియలేదు. ఎవరయితేనేం ఫర్‌ది టైం బీయింగ్ అనుకుంటూ.

"ప్లీజ్ డూ కమిన్" కారులో కూర్చుని తలుపు తెరిచాడు. సభ్యతపుట్టి పడేలాగా.

"కుమారీ - బావున్నావా" అన్నాడు. వెల్తుర్లో చూసి. సమాధానాన్ని ఆశించకుండా కారు పల్లకిలా బయలుదేరింది. నాగరికతకు దూరంగా నిశ్శబ్దం ప్రకృతిలోకి వచ్చింతరువాత "ఏంటీ కుమారీ- మీ బ్యాంకు ఏజంటుగారేమంటున్నాడు."

అంటూ నిశ్శబ్దాన్ని భంగపరిచాడు. ఆమె భుజం మీద చనువుగా చెయ్యేసి- ప్రకృతిని కూడా భంగపరిచే ప్రయత్నంలో. కుమారి అతని స్పర్శను లెక్క చెయ్యకుండా కాలిగోళ్ళవైపు చూస్తూ కూర్చుంది.

"నిన్ను రెండు మూడుసార్లు చూసేను బజార్లో- పలకరిద్దామనుకున్నాను గానీ, మీబాస్ వున్నాడు. ఎందుకులే అని వూరుకున్నాను."

"నీకూ కూడా అప్పుడప్పుడూ మనిషి బుద్ధులు పుడుతుంటాయన్న మాట."

ఆ మాటతో శేషుబాబుకు ఉడుకుమోత్తనం వచ్చింది. రోడ్ మీద నుంచి దృష్టిని ఆమె మీదకు సారించాడు.

టీరోబల్బ్ కాంతిలో నలభయ్యేళ్ళవడిలో కూడా ఆమె అందంగానే కనిపించింది.




"నువ్వలా మాట్లాడి రెచ్చగొడితే వున్నమనిషి బుద్ధికాస్తా పోతుంది" అన్నాడు చెయ్యిదాచి ఆమె నడుంచుట్టూ చెయ్యిని పోనిస్తూ. ఆమె జరిగిడోర్‌నానుకొని కూర్చుంది. శేషు శృంగారాన్ని స్పీడవ్‌చేస్తూ కారుని స్లోచేసేడు.

"యిదిగో శేషూ నాకీ వయసులో క్రొత్తగా కోల్పోయే పతివ్రతా ధర్మం ఏం లేదుగానీ- యింత హఠాత్తుగా నేనెందుకు రావలసివచ్చిందో తెలుసుకోవాలన్న కామన్‌సెన్స్ లేదేం నీకు!" విసుగ్గా అంది కుమారి.

"అలాగ అడక్కపోవడమే కామన్ సెన్స్" రోడ్డుకి బాగా ఓరగా కారు ఆపుచేసేడు సీటుమీద ఒరిగి ఆమె తొడమీద తలపెట్టుకొని-

"ఏంటి కుమారీ విశేషాలు. కాసేపు తియ్యగా కబుర్లు చెప్పు. నీతో మాట్లాడి చాలా కాలమయింది." అన్నాడు చొరవగా ఆమె భుజం నొక్కుతూ.

కుమారి అతని చేతిని లాగేస్తూ విసుక్కుంది.

"నువ్వింకా నాకళ్ళకు యిరవయ్యేళ్ళనాటి కుమారి లాగే కనిపిస్తున్నావ్ సుమా" అన్నాడు ఆమెను సుముఖంచేసే ప్రయత్నంగా.

"నువ్వింకా నాకు మనిషి రక్తం రుచి మరిగిన తోడేల్లాగానే కనిపిస్తున్నావ్" "ఏమీ మార్పు రాలేదు" ఉపసంహరించింది కుమారి.

అతనికి కోపం వచ్చింది. రక్తం మరిగింది.

ఆమె ముఖాన్ని సీటుకు అదిమిపెట్టి గట్టిగా ముద్దుపెట్టేసేడు.

కుమారి తుపుక్కున ఉమ్మేసి -రుమాలుతో తుడుచుకుంది. అతను పకపకా నవ్వి "యింటికెళ్ళి డెట్టాల్‌తో కడుక్కో" అన్నాడు.

"నాది డెట్టాల్‌తో పోతుందిగానీ నువ్ చేసిన పాపం కడగడానికి గంగ చాలదు."

"నాకేపాపం అంటదు కుమారీ- నేను కర్మయోగిని. కర్మచెయ్యడమేగాని దాని ఫలితం ఆశించను" అన్నాడు.

సాక్షాత్తూ కృష్ణపరమాత్మని. ఆ విషయం క్రొత్తగా చెప్పక్కర్లేదు"

"మరిప్పుడు క్రొత్తగా ఏం తెలుసుకుందామని వచ్చేవ్" ఆమె గెడ్డంమీద వ్రేలితో రాస్తూ అడిగాడు.

"నీకర్మఫలాన్ని నీవారసుడు- నీకొడుకున్నాడుగా. అతననుభవిస్తానంటున్నాడు" పాపం ఆ కుర్రాడు నీఅంత స్థితప్రజ్ఞుడు కాదు" వట్టివట్టి నెమ్మదిగా అందికుమారి.

అతని చెయ్యి జారిపోయింది.

"ఏంటి మా సంజీవ్-నీదగ్గరకొచ్చేడా వచ్చి- ఏవన్నాడు?" శేషులేచి నిటారుగా కూర్చున్నాడు.

"అనడానికేముంది?" ఆమెగోళ్ళవైపు చూసుకుంటూ నిర్లక్ష్యంగా అంది. "నువ్వేసిన కాకిరెట్ట మొలకెత్తి పెద్దదయింది.

అది నువ్ కష్టపడి కొంపలార్పి నిర్మిం

చిన అంతస్థుల్ని.సంప్రదాయాల్ని కూకటి వ్రేళ్ళతో పెల్లగించుతోంది."

కొడుకు పేరు వినగానే అతనిలో రేగిన అలజడిని ఆమె గమనిస్తూనే వుంది.

తన కొడుకు ఏం జేసేడు. కుమారి కూతుర్ని- ఆమెతో అక్రమ సంబంధం అతని మనసులోకి అక్రమ సంబంధం గురించి తప్ప సక్రమ సంబంధంగురించి ఆలోచన రాలేదు.

"నీకొడుకు సంజీవ్-నాకూతుర్ని చేసుకుంటాడట.

ప్రపంచంలో ఏ శక్తి దాన్నాపుచెయ్య లేదట.నీ పాప ఫలితం నీ యిష్టం- అన్నా చెల్లెలుకు పెళ్ళి చేస్తావో- నీ కొడుక్కి నచ్చజెప్పుకుంటావో- కర్మయోగివి-నీకు నేను చెప్పదగ్గదాన్ని కాదు."

యింక చెప్పవలసిందేమీ లేదన్నట్టు బయటికి చూస్తూ కూర్చుంది కుమారి.

బాటలో మసకవెన్నెల- బాటతప్పిన తోటలో చిమ్మచీకటి.

కుమారి ఎప్పుడు దిగిపోయిందో-కారు అలవాటుగా యిలు చేరుకుంది.

యింటినిండా లైట్లు వెలుగుతున్నాయి సంజీవదేవ్ సోఫాలో పడుకుని చదువుతున్నాడు.

చేతిలో పుస్తకం ఉదయం దే- మై యూనివర్సిటీస్ సుధ ఏదో ఆడవాళ్ళ పుస్తకం తిరగేస్తోంది.

"సాయంత్రం ఎక్కడికీ వెళ్ళలేదా" స్నానం భోజనం అయిందనిపించి హాల్లో కూర్చున్నాడు శేషు.

"లేదు" జవాబిచ్చింది సుధ.

"ఏరా సంజూ సరదాగా తిరిగిరాలేక పోయారా."


కొడుకుతో సరళంగా- సవ్యంగా మాట్లాడానికి ప్రయత్నం. తెరిచి వుంచిన పుస్తకం గుండెలమీద బోర్లించి ఒకసారి తండ్రివైపు దీర్ఘంగా చూసేడు సంజీవ్.

"మీరు సంపాదించిన మెడల్స్ నేను మెళ్ళోవేసుకొని తిరగడమేగా.బయటికెళ్ళి చేసేదేముంది" అన్నాడు. తండ్రివైపు సూటిగా చూస్తూ.

ఎప్పుడూ గుండెల్లో గుచ్చినట్టే మాట్లాడుతాడు.

వీడికి నేను చేసిన అన్యాయం ఏమిటో సంపాదించి తినరా అంటే- పోయేకాలం.





దీప నృత్యం
చిత్రం: టి.వి.యస్.మూర్తి

వెధవ పుస్తకాలన్నీ చదవొద్దని పళ్ళూడ కొట్టక లోలోపల పళ్ళు కొరుక్కున్నాడు శేషుబాబు.

సుధ శేషుబాబువైపు ముంగిసనాదలి ఆనందిస్తున్నట్టు చూస్తోంది.

ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్. నందినీ స్పిన్నింగ్ అండ్ వీవింగ్ మిల్స్. డైరెక్టరూ-వందనారోలింగ్ మిల్స్ అధినేత-ఎన్నో కంపెనీల్లో షేర్‌హోల్డరూ అయిన శేషా చలపతిగారు - సంజీవ్ ముందు నిరుత్తరుడై తల వంచుకోవడం వింతగా చూస్తోంది సుధ.

మానవత్వం ముందు-స్వార్థం-పీడన-సిగ్గుతో తల వంచవలసిందే - అంతిమ విజయం ప్రేమదే. ప్రేమించ లేనివాడు దోషిగా నిలబడక తప్పదు. అందరికంటే నిర్భాగ్యుడు వాడే అనుకుంది.

అణాకాసు సంపాదించడం రాని వీడి ముందు తనెందుకు మరుగుజ్జు వాడైపోతాడో అర్థంకాదు శేషుబాబుకి. లేచి గదిలోకి వెళ్ళిపోయాడు.

హాల్లో-తల్లి-కొడుకూ నిశ్శబ్దం మిగిలిపోయారు.

"ఎందుకురా ఆయనతో అలాగా పోట్లాటపెట్టుకుంటావ్" అనునయంగా అడిగింది సుధ.

నిశ్శబ్దాన్ని తరుమూతూ.అతనుచెప్పే జవాబు తెలుసు. ఆ పోరాటానికి అంతం లేదనీ తెలుసు. అయినా కొడుకు మాట్లాడుతుంటే సుధకు తృప్తి.

అతని మౌనం తాలూకు పెగలంటే ఆమెకు భయం.

"ఉదయం పెద్దమ్మ కనిపించింది."

"ఎక్కడ? యింటికెళ్ళేవా" ఆసక్తిగా అడిగింది సుధ.

"ఆ అర్హతమనకెక్కడిది? దేవాలయం వీధిలో నించి కార్లో వస్తున్నాను. పెద్దమ్మ-అల్లంతదూరాన ఎదురుగా రోడ్డు మీద నడుస్తూ వస్తోంది. నాలో రక్త ప్రసారం ఆగిపోయింది. అసూర్యంపశ్య లాంటి పెద్దమ్మను రోడ్డుమీదచూసి కారాగిపోయింది. ఆవిణ్ణి చూడలేక స్టీరింగ్ మీద తల వాలిపోయింది పెద్దమ్మ నా తల మీద చెయ్యేసి నిమిరి- బహుశా ఆశీర్వదించిందేమో ప్రసాదం ప్రక్కనే వుంచి వెళ్ళిపోయింది. నాస్తికుల ప్రార్థన దేవుడు వినడేమో. లేకపోతే నా కారుని తప్పకుండా ఏ లారీయో గుద్దేసును" కళ్ళు మూసుకున్నాడు సంజీవ్. కళ్ళు తుడుచుకుంది సుధ.

ఆవిడకు పిల్లల్లేరు. నిజమే. కొంత భూమి మనోవర్తి యిచ్చి అన్నగారి ఆస్థి మొత్తం స్వాధీనం చేసుకున్నారు. ఆవిడ తదనంతరము తీసుకోవచ్చుగా భర్తపోయి పుట్టెడు దుఃఖంలో వున్న ఆవిడ ఆస్తి కోసం ఈయనకంత ఆశబోతనం ఎందుకు.

అత్తారింటికెళ్ళిపోయి భార్య తాలూకు పొలాలు దున్నుకుంటున్న పెద్దన్నయ్య కళ్ళముందు కొచ్చేడు సుధకు. శుభ్రంగా వ్యాపారం చేసుకుంటున్న అన్నయ్యని- అరచేతిలో లక్షల లాభాలు చూపించి- ఆశల్నిరేపి చివరికి బికార్ని చేసేడు.

అప్పులోళ్ళు వేలంవేస్తే పరువు నష్టమని- ఆస్తినంతట్నీ చవగ్గా తనే కొనేసుకున్నాడు.

భస్మాసుర హస్తం. ఎవరూ పైకి రాకూడదు. ఏం మనిషో నిట్టూర్చింది సుధ.

"సుధా" లోపల్నించి పిలుపు. మాట ముద్దగా వుంది. తల్లీ కొడుకు మొహాలు చూసుకున్నారు.

అతని ఆరోగ్యానికి విస్కీ- విషం.

సుధ మొహాన కుంకుమ ఎర్రగా మెరుస్తోంది లైటుకాంతిలో. సంజీవ్ తల్లి మొహంమీదనుంచి దృష్టిని తిప్పుతుంటూ "నువ్వెళ్ళు. అంత కష్టమేమొచ్చిందో చూడు" అన్నాడు.

తాగలేని తన పరిస్థితికి బాధపడుతూ తాగుతున్నాడు-శేషు. ఒక గ్లాసుకూడాపూర్తి కాలేదు. మనిషిలో మార్పు వచ్చేసింది.

సుధ బాటిల్ మూత పెట్టేసి బీరువాలో దాచేసింది. గ్లాసులో మిగిలిన ద్రవం కిటికీలోంచి పారబోసింది. మెడిసిన్ కలిపి గొంతుకలో పోసింది.

"తెలుసుండీ ఎందుకు బాధపడ్డం?" అతను కాస్త స్థిమితపడ్డాక అంది సుధ.

"ఊ- నీకొడుకు- వాడు నన్ను స్థిమితంగా వుండనిస్తున్నాడా."

"క్రొత్తేముంది. యిద్దరికీ ఎప్పుడూ వున్నదే కదా?"

"క్రొత్తదే- చిక్కు సమస్య తీసుకొచ్చేడు నానెత్తిమీదికి"- సిగరెట్ వెలిగించాడు శేషుబాబు.

"వీడికి ప్రపంచంలో ఎక్కడా దొరకనట్టు ప్రేమించడానికి ఆ పిల్లే దొరకాలా సుధా నువ్వేలాగైనాసరే వాడికి నచ్చచెప్పాలి." ఉద్వేగంగా చెయ్యి పట్టుకున్నాడు శేషుబాబు.

"ఏంటి? అసలేం జరిగింది?" తాపీగా అడిగింది సుధ.

"నేను అమెరికానుంచి వచ్చేసేక- మిర్యాలపాడులో రోలింగ్‌మిల్లు కట్టించాం జ్ఞాపకంవుందా- అప్పటికి వెధవకి నాలుగేళ్ళుంటాయేమో. అప్పుడు నేను అక్కడ వుండిపోయేను యిల్లుతీసుకొని- రెండు మూడు నెలలు.

అప్పుడే ప్రక్కింటి అమ్మాయి పరిచయం అయింది. చాలా అమాయకంగా పెద్దకళ్ళు- సన్నని నడుము- గుండ్రని- అబ్బ రాత్రులు నిద్ర వుండేది కాదు.

ఒక రోజు బయట నిలబడివుంది-తల పగిలి పోతోంది. కొంచెం కాఫీ కావాలన్నాను. గదికి తీసుకొచ్చియిచ్చింది. సాలి గూట్లో చిక్కుకుంది. స్వర్గంచూపించేను. యూస్‌లెస్‌ఫెలో-ఏడ్చింది-సుఖపడ్డంరాదు అవకాశాల్ని వుపయోగించుకోడంరాదు- నేర్పినా- నేర్చుకోరు. మళ్ళావచ్చింది కాదు- నెలరోజుల తరువాత వచ్చింది. ఏడ్చింది. ఎబార్షన్‌కయ్యే ఖర్చంతా నేనే పెట్టుకుంటానన్నాను. విన్నదికాదు. పొమ్మన్నాను. నాకు తెలీదనన్నాను. ఆ డబ్బూ దక్కలేదు. ఎవర్నో చేసుకుంది. మేనమామే అనుకుంటాను. అప్పుడు ఎబార్షన్ చేయించుకుంటే పోలా-తాడని విసిరేసింది యిప్పుడు పామై మెడకు చుట్టుకుంది. ఈ వెధవ - నువ్వే ఎలాగయినా చెప్పాలి. నేనంటే అసలే తలకి రోకలి చుట్టుకుంటాడు.

సుధ నిట్టూర్చింది. ఇలాంటి సంఘటనలెన్నో! అంతులేదు. విని విని మనసు మొద్దుబారిపోయింది. మంచివాళ్ళని పాడు చెయ్యడంలో ఈతని కెందుకింత తృప్తి.



యిప్పటికైనా పశ్చాత్తాపం అన్నది లేదే! జీవితంలో ఎదురు దెబ్బన్నది లేదని గర్వం.

అమెరికా వెళ్తూ "నెలదాటి పదిరోజులయింది. యిదే నిజమైతే నేను తిరిగి వచ్చేసరికి - నా కొడుకు ఎయిర్ పోర్టుకి పరిగెత్తుకుంటూ వచ్చి స్వాగతంచెప్తాడు" బుగ్గమీద గోరుతో గీస్తూ అతనన్న మాటలకు పులకించింది సుధ.

"అలాజరగకపోతే నీకు పనిష్మెంటు ఏమిటో తెలుసా? నా కొడుకుతో సహా విమానంనించి దిగుతాను" అతను నవ్వుతూ అన్నా సుధ మనసు విలపించేంది.

అతను అమెరికా వెళ్ళిన మర్నాడు హాస్పిటల్లో చూపించారు. తల్లయ్యే అవకాశం లేనే లేదన్నారు. సుధ వణికిపోయింది. కృంగిపోయింది. మంచంపట్టింది. సుధ మేనత్త-ముగ్గురు చాలనుకుంటూనే- నాలుగవసారి గర్భం ధరించడం సుధ పాలిట వరమయింది. అత్తా - మామా ఆఖరి కొడుకుని ఆనందంగా యిచ్చి ఆమెని బ్రతికించారు.

ఎయిర్‌పోర్టులో పరుగెత్తి కెళ్ళి స్వాగతంచెప్తున్న కొడుకుని ఆనందంగా హృదయానికిహత్తుకొని విజయగర్వంతో సుధవైపు చూసేడు శేషుబాబు.

"ఏంచేస్తావ్" సిగరెట్‌పారేసి ఇంకోటి వెలిగించబోతూ అడిగాడు శేషుబాబు- మాట్లాడకుండా కూర్చున్న సుధని చూసి.

"ఆ పిల్లను నేనుకూడాచూసేను చాల బావుంది. ఆ కుటుంబంకూడా మంచి సంప్రదాయం-సంస్కారంవున్నవాళ్ళలా కనిపించేరు" అంది సుధ నెమ్మదిగా.

"అయితే - నీకు బుద్ధిలేదా - నేను చెప్పింది అర్థమవలేదా?" ఆ పిల్ల నా కూతురు" సహనాన్ని కోల్పోయి అరిచాడు శేషుబాబు.

సుధ అతనివైపు నిదానించి చూసింది- ఈ అహంభావిని - ఈ స్వార్థపరుణ్ణి - మొఖంమీద ఊడ్చి కొట్టాలనిపించింది.

లేచి నిలబడింది.

"దయచేసి ఈ పెళ్ళికి ఆటంకం పెట్టకండి. సంజీవదేవ్‌కి తండ్రి మీరు కాదు- మా మామయ్యా!" సుధ బయటికి వచ్చి తలుపులు చేరేసింది.